క్లుప్తంగా

అచ్చారే.. మత్స్యారే..



మత్స్యకారులకు చిక్కిన చుక్క చేపలు

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు బుధవారం భారీ మత్స్యసంపద చిక్కింది. మత్స్యకారులు ఆయా చేపలను అమినాబాద్ శివారు చేపలరేవులో విక్రయించారు. మత్స్యకారులకు చిక్కిన భారీ కోణాలు, నల్లచందువాలు తదితర చేపలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ఎగబడ్డారు. సుమారు రూ.2 లక్షలకు వీటిని కొనుగోలు చేశారు. ఈ చేపలను తమిళనాడు, కేరళ, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తామని వ్యాపారులు తెలిపారు.

సోషల్ మీడియా చురుగ్గా పని చేయాలి



పోస్టర్లు చూపుతున్న కార్యకర్తలు

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచి పనిని వారికి మరింత చేరువ చేసేలా సోషల్ మీడియా కార్యకర్తలు వేగంగా పని చేయాల్సిన సమయం వచ్చిందని జెడ్పీటీసీ ఎలిశెట్టి అమృత అన్నారు. బుధవారం సాయంత్రం ఇస్మాయిల్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు ఖండించాలని సూచించారు. కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పెద్దాపురం అభ్యర్థి దవులూరి దొరబాబు విజయాలకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఎలిశెట్టి నరేష్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు లింగం శివ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెద్దాపురం: రైతులు సమగ్ర యాజమాన్య సస్య రక్షణ పోషక పద్ధతులు పాటించాలని మండల ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత అన్నారు. ఆర్‌బీపట్నం గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కొబ్బరి, ఆయిల్‌పామ్ సాగు పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యాన సహాయకులు చిలకమ్మ అధ్యక్షత వహించారు. సుజాత మాట్లాడుతూ సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులు మరింత అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. జీవ నియంత్రణ పద్ధతుల్లో సమగ్ర సస్యరక్షణ ద్వారా పురుగుని అరికడితే రైతుకు, పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. తెల్లదోమ నివారణ పద్ధతులను రైతులకు వివరించారు.

భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం నూతన కమిటీ



సామర్లకోట భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం నూతన కార్యవర్గం

సామర్లకోట: భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం నూతన కమిటీ ఎన్నిక బుధవారం సీపీఎం సీనియర్ సభ్యుడు కరణం ప్రసాదరావు అధ్యక్షతన జరిగింది. నూతన అధ్యక్షునిగా బాలం హరిబాబు, కార్యదర్శిగా చల్లా మహేష్, ఉపాధ్యక్షురాలిగా టి నాగమణి, సహాయ కార్యదర్శిగా కరణం గోవిందరాజు, కోశాధికారిగా కరణం ప్రసాదరావుతో పాటు, కార్యవర్గ సభ్యులుగా బాలం శ్రీనివాసు, ఎస్‌కే ఫాతిమా, కె వరలక్ష్మి, విప్పర్తి కొండలరావు, దారబాని కృష్ణ, బాలం సత్తి బాబు ఎన్నికయ్యారు. విజ్ఞాన కేంద్రం తరఫున రక్తదానం, ప్రజోపయోగ కార్యక్రమాలు చేస్తామని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

కళాకారులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి



ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కళాకారులు

సామర్లకోట: మాధవపట్నంలో సుమారు 40 ఏళ్లుగా నివసిస్తున్న దాదాపు 600 మంది తోలు బొమ్మలాట కళాకారులకు కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని బుధవారం ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్ శ్రీనివాసుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తోలు బొమ్మలాట వృత్తి కళాకారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అనపర్తి ఏడుకొండలు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో తోలు బొమ్మలాట కళాకారులు ఉంటున్నారని తెలిపారు. అన్ని జిల్లాల్లోను కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తుండగా, కేవలం సామర్లకోట మండలంలోనే ఇవ్వడం లేదని ఆరోపించారు. దీంతో వారి పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడుతోందన్నారు.

పల్లెలు సిరిమల్లెలు

- స్వచ్ఛత వైపు గ్రామాల అడుగులు
- చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో సత్ఫలితాలు
- పల్లెటూర్లలో ఆహ్లాద వాతావరణం
- పంచాయతీలకు అదనపు ఆదాయం



చదలాడ సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ రాజశేఖర్

పెద్దాపురం: పర్యావరణానికి ఊపిరి పచ్చదనం-పరిశుభ్రత. వీటిని విస్మరిస్తే.. పల్లెలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటాయి. ఈ నేపథ్యంలో మారుమూల గ్రామీణ ప్రాంతాలను సైతం అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక బృహత్తర కార్యక్రమాలను చేపట్టింది. అందులో భాగంగానే సంపద తయారీ కేంద్రాలు ముమ్మరంగా పనిచేస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛత వైపు అడుగులు వేస్తోంది. గ్రామాల్లో పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. గ్రామాలను వ్యర్థ రహితంగా తీర్చిదిద్దితోంది. శానిటేషన్ మెరుగు పర్చి వ్యాధులను తరిమికొట్టడం, పంచాయతీలకు ఆదాయం సమకూర్చడం ద్వారా పల్లెల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. తద్వారా పల్లెల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణ, ఆహ్లాదకర వాతావరణంతో పాటు, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతోంది. ఈ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి, వినియోగంలోకి తెచ్చింది. వీటి సమగ్ర నిర్వహణ ద్వారా పల్లెల స్వరూపాన్నే మార్చేసింది.

నియోజకవర్గంలో 33 కేంద్రాలు

పెద్దాపురం నియోజకవర్గంలో 41 గ్రామాల్లో 33 సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రీన్ అంబాసిడర్లు, నిత్యం విధిగా ఇళ్ల నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారు. సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తలుగా వేరు చేసి, సంపద కేంద్రాల వద్ద నిల్వ చేస్తారు. పొడి చెత్తను రీ సైక్లింగ్ చేసి వ్యాపారులకు అమ్మడం, తడి చెత్తను ఆరుబయట ఆరబెట్టి, ఆ తర్వాత కేంద్రాల్లో ఉన్న గుంతల్లో నిల్వ చేసి, వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేస్తారు. ఈ ఎరువును తక్కువ ధరకు గ్రామాల్లోని రైతాంగానికి విక్రయిస్తూ, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. తద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తున్నారు. కేంద్రాల నిర్వహణకు ప్రతి కేంద్రం వద్ద గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేసి, తరచూ శిక్షణ ఇస్తున్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా నిధులు ఖర్చు చేస్తున్నారు.

వివిధ రూపాల్లో పారిశుధ్య నిర్వహణ

ప్రభుత్వం పల్లెల్లో పారిశుధ్య నిర్వహణను వివిధ రూపాల్లో చేపడుతోంది. చెత్త సేకరణ రిక్షాలు, ట్రాక్టర్లు, పవర్ ఆటోల ద్వారా చెత్తను సేకరించడం, ఫాగింగ్ మెషీన్లు, హైపర్ టాయిలెట్ క్లీనర్లతో క్రిమికీటకాలు, దోమలు నాశనం చేయడం ద్వారా చాలా వరకూ వ్యాధులను నివారించారు. పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టడంతో, పల్లెల్లో ఆహ్లాద వాతావరణం ఏర్పడింది. విస్తృతంగా మొక్కలు నాటి పల్లెలను పర్యావరణ హితంగా మారుస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో నిధుల దుర్వినియోగం

సంపద కేంద్రాల ఏర్పాటుకు గత ప్రభుత్వ హయాంలో రంగం సిద్ధం చేశారు. ప్రతి మండలంలో ఒకటి, రెండు కేంద్రాలు ఏర్పాటు చేసి, అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసినట్టుగా భారీగా నిధులు దుర్వినియోగం చేశారు. ఈ కేంద్రాల ప్రాధాన్యాన్ని గుర్తించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసి, సంపద కేంద్రాలను ప్రాధాన్య క్రమంలో వినియోగంలోకి తెచ్చింది.

పారిశుధ్య నిర్వహణ బాగుంది



గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ బాగుంది. గ్రీన్ అంబాసిడర్లు విధిగా రోజూ ఇళ్ల నుంచి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తున్నారు. గతంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త, మురుగు దర్శనమిచ్చేవి, ఇప్పుడా పరిస్థితి లేదు. అధికారులు తరచూ పర్యవేక్షిస్తుండడంతో పల్లెల్లో ఆహ్లాద వాతావరణం నెలకొంది. ప్రజారోగ్యం మెరుగు పడింది.

– బందారు వీరబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్, జి.రాగంపేట, పెద్దాపురం

కేంద్రాల నిర్వహణ భేష్



పల్లెల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా జరుగుతోంది. ప్రత్యేక శిక్షణ పొందిన గ్రీన్ అంబాసిడర్లు, చెత్త సేకరణ, కంపోస్టు ఎరువు తయారీ, ఫాగింగ్ దోమల మందు పిచికారీ వంటి కార్యక్రమాలను చక్కగా నిర్వహిస్తున్నారు. సంపద కేంద్రాల ద్వారా పల్లెల్లో అహ్లాద వాతావరణంతో పాటు, పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూరుతోంది. పల్లెలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయి.

– కె.రాజశేఖర్, మండల విస్తరణాధికారి, పెద్దాపురం

ఆర్డీఓ కార్యాలయ ఏఓగా సుబ్రహ్మణ్యం



పెద్దాపురం: ఆర్డీఓ కార్యాలయ పరిపాలనాధికారిగా కె.సుబ్రహ్మణ్యం బుధవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు కార్యాలయ ఇన్‌ఛార్జి ఏఓగా పనిచేసిన వెంకటలక్ష్మిని కృష్ణా జిల్లా ముప్వకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. శంఖవరం తహసీల్దార్ సుబ్రహ్మణ్యంను ఇక్కడ ఏఓగా బాధ్యతలు అప్పగించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

స్వామినాయుడుకు దొరబాబు నివాళులు



స్వామినాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దొరబాబు తదితరులు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి తండ్రి స్వామినాయుడుకు వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు బుధవారం నివాళులర్పించారు. స్వామినాయుడు ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, అధికార పార్టీ కౌన్సిలర్లు, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

16న భారత్ బంద్

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న భారత్ బంద్ చేస్తున్నట్టు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్ తెలిపారు. స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో బుధవారం జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి సీపీఐ పట్టణ కార్యదర్శి పెదిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. బంద్‌ను విజయవంతం చేయాలని రవీంద్రనాథ్ కోరారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మికుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పడాల రమణ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తోకల ప్రసాద్, కాకినాడ జిల్లా సీపీఐ కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ప్రజానాట్య మండలి నాయకులు మడగల రమణ, అర్జునరావు, సప్ప సూరిబాబు, అడపా చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మేలు చేసిన జగన్

- నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ





సామర్లకోటలో మహిళా సంఘాలకు నమూనా చెక్కు అందజేస్తున్న దవులూరి దొరబాబు, కాండ్రకోటలో నమూనా చెక్కు అందజేస్తున్న దృశ్యం

సామర్లకోట: ప్రతి ఇంటికి మేలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని 23 వార్డుల మహిళా సంఘాలకు స్థానిక పాత్రుళపేట పెద్దమిల్లులో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజలకు మేలు జరిగిందంటేనే తనకు ఓటు వేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా చెబుతున్నారన్నారు. ప్రతిపక్షానికి పొరబాటున ఓటు వేయడమంటే, సంక్షేమ పథకాల రద్దుకు ఓటు వేసినట్టేనని హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా అందేలా కొత్త ఒరవడిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించారని పేర్కొన్నారు. అందువల్లే అవినీతికి ఆస్కారం లేదని చెప్పారు. మహిళా సంఘాలకు నాలుగు వాయిదాల్లో రుణమాఫీ చెల్లిస్తానని హామీ ఇచ్చి, అమలు చేశారని తెలిపారు. మహిళా సంఘాలపై భారం లేకుండా సున్నా వడ్డీ పథకాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. గత టీడీపీ పాలనలో పుష్కలంగా నిధులున్నా, ఈ పథకాలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపించడంతో మాయ మాటలు చెప్పేవారు వస్తారని హెచ్చరించారు. మహిళలకు జరుగుతున్న మేలును దృష్టిలో ఉంచుకుని మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలన్నారు. స్థానిక అభ్యర్థిగా పెద్దాపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని దొరబాబు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు మెచ్చుకునేలా సేవలు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు నమూనా చెక్కును అందజేశారు. పట్టణంలోని 819 మహిళా సంఘాలకు నాలుగో విడతలో రూ.5,59,76,000 బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్టు మెప్మా సీటీ మిషన్ మేనేజరు సుజాత తెలిపారు. మహిళలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరి, వైస్ చైర్‌పర్సన్లు గొౕకిన సునేత్రదేవి, నెక్కంటి సాయిప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా

పెద్దాపురం: రాష్ట్రంలో ప్రతి మహిళకూ మరింత ఆర్థిక భరోసాను కల్పించేందుకే ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీలో భాగంగా మండలంలోని కాండ్రకోట గ్రామంలో బుధవారం సర్పంచ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మహిళా సాధికారతతో పాటు, అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీయే అన్నారు. మహిళల ఆర్థిక భరోసాకు వైఎస్సార్ ఆసరా పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి స్వయం సహాయక సంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగో విడత కాండ్రకోట, ఉలిమేశ్వరం, మర్లావ, గుడివాడ, సిరివాడ, తూర్పుపాలక గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాలకు విడుదలైన చెక్కులను దొరబాబు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, వెలుగు ఏపీఎం సూర్యనారాయణ, ఎంపీటీసీ భద్రరావు, ఉప సర్పంచ్ జోకా నానాజీ, పల్ల గంగారావు, లక్కాకుల నానాజీ, నూకాలమ్మ దేవస్థానం చైర్మన్ గవరసాని వీరాస్వామి, గంటా రామస్వామి, పెంటా విజయ్‌కుమార్, గవరసాని రాజశేఖర్, శేరు వెంకబాబు తదితరులు పాల్గొన్నారు.

మరింత వేగంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు



ఆర్‌బీపట్నంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ, ఈఓపీఆర్డీ

పెద్దాపురం: డివిజన్‌లోని అన్ని సచివాలయాల్లో నవరత్నాలు.. అందరికీ ఇళ్లు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగం చేయనున్నట్టు పెద్దాపురం డీఎల్‌పీఓ బాలామణి అన్నారు. మండలంలోని ఆర్‌బీకొత్తూరు, ఆర్‌బీ పట్నం గ్రామ సచివాలయాల్లో బుధవారం ఈఓపీఆర్డీ కె.రాజశేఖర్‌తో కలిసి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. డీఎల్‌పీఓ బాలామణి మాట్లాడుతూ పేదలందరికీ ఇంటి పట్టాతో పక్కా రిజిస్ట్రేషన్ చేసి, ఇళ్ల స్థలాలను అప్పగించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు, ప్రతి లబ్ధిదారుడికి వారి ఇంటి పట్టాను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నట్టు చెప్పారు. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లబ్ధిదారులు ఇబ్బందులు పడరాదనే ఉద్దేశంతో, అందుబాటులో ఉన్న సచివాలయాల వద్దే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏర్పాటు చేసినట్టు వివరించారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగునీటి సమస్యకు చెక్

- ఒక్క రోజులోనే పరిష్కారం చూపిన ఎంపీ వంగా గీత
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



పిఠాపురం శివారులో నీటి ఎద్దడి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులు

పిఠాపురం: ఏలేరు ఆయకట్టు పరిధిలోని శివారు ప్రాంతాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మేరకు ఆయకట్టు రైతులు కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత దృష్టికి సమస్యను తీసువెళ్లగా వెంటనే పరిష్కరించారు. వివరాల్లోకి వెళితే... ఏలేరు ఆయకట్టు పరిధిలోని పిఠాపురం మండలంలో శివారు ప్రాంతాలకు సాగునీటి ఎద్దడి ఏర్పడింది. ఈ విషయాన్ని రైతులు ఎంపీ గీత దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, నీటిపారుదల శాఖ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, ఈఈ రాంగోపాల్‌లకు సమాచారం ఇచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన అధికారులు బుధవారం సాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో పర్యటించారు. కాండ్రకోట రెగ్యులేటర్ నుంచి ఏలేరు శివారు ప్రాంతమైన పిడిందొడ్డి వరకూ ఉన్న కాలువలు, రెగ్యులేటర్లు పరిశీలించారు. పిఠాపురం మండలం పి.దొంతమూరు, రాపర్తి, రాయవరం, విరవాడ, ఎల్ఎస్‌పురం, పిఠాపురం తదితర ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు రైతులతో మాట్లాడారు. నీటి ఎద్దడిని గుర్తించిన అధికారులు తక్షణమే ఏలేరు నుంచి విడుదల చేస్తున్న 800 క్యూసెక్కుల నీటిని పెంచి 1000 క్యూసెక్కులు విడుదల చేయించారు. రైతులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎంపీ వంగా గీతకు సమస్యను తెలియజేసిన వెంటనే పరిష్కరించడపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు కాశి సురేష్, శ్రీనివాస్, జెడ్ఆర్‌యూసీసీ మెంబర్ రావుల మాధవరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రూ.12.30 కోట్ల ఆసరా



ఎంపీపీని సత్కరిస్తున్న మహిళా సంఘాల సభ్యులు

సామర్లకోట: మండలంలోని 1,645 మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా కింద రూ.12.30 కోట్లు మంజూరైనట్టు ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు తెలిపారు. బుధవారం సాయంత్రం మండలంలోని మహిళా సంఘాలకు బ్రహ్మానందపురం లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వి.ప్రశాంతి అధ్యక్షత వహించారు. ఆసరా నమూనా చెక్కును ఎంపీపీ అందజేశారు. మహిళా సంఘాల సభ్యులు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎంపీపీని ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ ఎలిశెట్టి అమృత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, వైస్ ఎంపీపీలు ములసా శ్రీను, పేర్నిడి వెంకట్రాయుడు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, ఎస్ కొండలరావు, ఉటా వాసు, పార్టీ జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో ప్రయాణికులపై దాడులు



ఉప్పాడ- కాకినాడ బీచ్ రోడ్డు

కొత్తపల్లి: ఉప్పాడ- కాకినాడ బీచ్ రోడ్డులో వెళ్లాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణికులపై తరచూ గంజాయి బ్యాచ్ దాడులు చేస్తోంది. రాత్రులు ఒంటరిగా వెళ్లే ప్రయాణికులపై దాడి చేసి వారి వద్ద ఉన్న నగదు, విలువైన వస్తులు లాక్కొంటున్నారు. ఇటీవల ఉప్పాడకు చెందిన ఓ వ్యక్తి తన సోదరుడు ఊరు నుంచి వస్తుండగా తీసుకురావడానికి బీచ్ రోడ్డులో మొటారు సైకిల్‌పై వెళుతుండగా ఎస్పీజీఎల్ విద్యుత్ కర్మాగారం దాటిన తరువాత చిన్నవంతెన సమీపంలో ఒక్కసారిగా పలువురు యువకులు వచ్చి అడ్డగించారు. తన వద్ద ఉన్న నగదు లాక్కోవడంతో పాటు దాడి చేసి గాయపరిచారు. గతంలో కూడా లారీని అడ్డగించి డ్రైవర్ వద్ద ఉన్న సొమ్ములు లాక్కున్నారు. దీనిపై ఇప్పటికే పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడును వివరణ కోరగా ఉప్పాడ- కాకినాడ బీచ్ రోడ్డుపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ప్రయాణికులపై దాడులకు సంబంధించి సూర్యారావుపేట లైట్‌హౌస్, ఉప్పాడ సెంటర్‌లోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి నిందితులను గుర్తిస్తామన్నారు. రాత్రి సమయంలో సిబ్బందితో గస్తీ నిర్వహిస్తామని తెలిపారు.

ప్రతిఒక్కరూ భాగస్వాములు కండి



కొత్తపల్లిలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

పెద్దాపురం: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పెద్దాపురం ఎంపీడీఓ ఎం.ఉషారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తన ఛాంబర్‌లో బుధవారం డీ వార్మింగ్ డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సున్న ప్రతిఒక్కరికీ డీ వార్మింగ్ మాత్రలను మింగించాలన్నారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోని ప్రతి ఒక్క విద్యార్థి ఈ మాత్ర వేసుకునేలా విద్య, వైద్యారోగ్య శాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కాండ్రకోట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బి.చంద్ర కిరణ్‌బాబు మాట్లాడుతూ ఏటా ఫిబ్రవరి 9న దేశవ్యాప్తంగా డీ వార్మింగ్ డే నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాజశేఖర్, ఎంఈఓ శర్మ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపల్లి: మండలంలో ఈ నెల 9న నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుష్మ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం వాల్ పోస్టర్‌ను ఎంపీడీఓ వెంకట నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుష్మ మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. విద్యార్థులు తప్పకుండా ఈ మాత్రలు వేసుకోవాలని సూచించారు.

విరగబూసిన మామిడి చెట్టు



పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో విరగబూసిన మామిడి చెట్టు

కొత్తపల్లి: ఈ ఏడాది మామిడి తోటల్లో పూత ఆశాజనకంగా ఉండటంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. వాతావరణం అనుకూలించడంతో పూత బాగుంది. పలు ప్రాంతాల్లో తేనే మంచు కారణంగా పూత మాడిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూతను కాపాడుకునేందుకు రైతులు క్రిమి సంహారక మందులను పిచికారీ చేస్తున్నారు. పూతపై మంచు ప్రభావం పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొంటున్నారు. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు.